క్లుప్తంగా

ఇన్‌చార్జి ఏపీఓ సస్పెన్షన్

పెదనందిపాడు: జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్లక్ష్యం వహించిన ఇన్‌చార్జి ఏపీవోను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఇన్‌చార్జి ఏపీఓ గోపిని జూలై నెల నుంచి తక్కువ పని దినాలు చేయించాడని, రోజుకు రెండు వేల పనిదినాలు కల్పించలేదని, డ్వామా పీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆధికారుల ద్వారా తెలిసింది.

నేడు పెదకాకానిలో విద్యుత్ సరఫరాకు ఆటంకం

పెదకాకాని: గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెదకాకాని ఏఈ బత్తుల శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. లైన్ల మరమ్మతుల సందర్భంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదకాకాని గ్రామంలోని వడ్డెర కాలనీ, సినిమా హాల్ సెంటర్, యాదవ పాలెం, పాత తహసీల్దార్ ఆఫీస్ రోడ్డు, పాతూరు, ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పాఠశాలలో ఇనుము చోరీపై కేసు నమోదు

గుంటూరురూరల్: పాఠశాలలో నాడు–నేడు అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన ఇనుము చోరీపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవాణి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జొన్నలగడ్డ గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు –నేడు ఆభివృద్ధి పనులకు సిమెంట్, ఇనుము తదితర వస్తువులు తెచ్చారు. ఈక్రమంలో గత రెండు రోజుల కిందట అభివృద్ధి పనుల కోసం తెచ్చి ఇనుము చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనపై పోలీసులను ఆశ్రయించగా, 25 ఇనుప రాడ్‌లు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు ఉచిత మెంటర్‌షిప్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వ హించనున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్–1 రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ రాణి సుస్మితతో ఉచిత మెంటర్‌షి ప్ అందిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రతి రోజూ రాసే సమాధానాలను క్షుణ్ణంగా పరిశీలించి, మరింత మెరుగ్గా సమాధానాలు రాసే విధానంతో పాటు ప్రిపరేషన్ టిప్స్, ఆన్సర్ రైటింగ్, జీఎస్ తదితర అంశాలపై తగు సూచనలు, సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఉచిత మెంటర్‌షిప్‌ను మెయిన్స్ పరీక్ష పూర్తయ్యే వరకు ఉపయోగించుకోగలరన్నారు. వివరాలకు 040–35052121, 91332 37733 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

నెహ్రూనగర్: జిల్లాలోని అన్ని రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రవాణా వాహనాలకు, ట్రాక్టర్ ట్రైలర్లకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అమర్చుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై వెళ్లే వాహనాలను వెనుక నుంచి వస్తున్న వాహనాలు సరిగ్గా గుర్తించి ప్రమాదాలను నిరోధించడానికి రేడియం స్టిక్కర్లు సహాయపడతాయని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి నెల వరకు రేడియం స్టిక్కర్లు అమర్చుకొని 814 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.8.14 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: శానిటరీ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేట 2వ లైన్‌లో సుంకర కిరణ్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం కిరణ్ షాపులో రూ.2 లక్షల విలువైన శానిటరీ సామాను చోరీకి గురైంది. అయితే లాలాపేట పోలీసులు నిందితుడిని గుర్తించారు. షేక్ మస్తాన్‌వలిని మంగళవారం అరెస్టు చేసి చోరీ సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బ్యాగులో పర్సు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ బ్యాగులోని పర్సును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట రెండో లైనుకు చెందిన అద్దంకి హైమావతి బంగారు నగలు కొనేందుకు మంగళవారం గంటలమ్మ చెట్టు వీధికి వెళ్లింది. కొద్దిసేపటి తరువాత బ్యాగు పరిశీలించగా అందులోని పర్సు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికి పర్సు చోరీకి గురైనట్లు గుర్తించింది. పర్సులో రూ.లక్ష నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదు

- సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి
- ఉన్నత పాఠశాల సందర్శన



కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సమగ్ర సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి

పెదనందిపాడు: సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, అలా చేస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సమగ్ర సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం ఎంఈవో కార్యాలయం, భవిత సెంటర్, పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. ఎంఈవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. నాడు–నేడు కింద సీఆర్‌పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని సిబ్బందికి సూచించారు. భవిత కేంద్రంలో వికలాంగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి చెప్పారు. కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జెడ్పీ పాఠశాలలో నాడు–నేడు కింద రూ.33 లక్షలతో నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి మంచి మార్కులు సాధించాలని, ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఆమె వెంట సమగ్ర శిక్ష జిల్లా కో ఆర్డినేటల్ రవికుమార్, ఎంఈవో డి బాలసుబ్రమణ్యం, ఈఈ సుధాకర్, ఏపీఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: ప్రజల సమస్యలను అధికారులు త్వరతగతిన పరిష్కరించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని గ్రామాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖాధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 14,15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటింటికి అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, డిప్యూటీ తహసీల్దారు వాసు, ఈవోపీఆర్డీ శివసుబ్రమణ్యం, బొద్దులూరి రంగారావు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీయింగ్‌పై అధికారుల బృందం దాడులు

ప్లొక్లెయినర్‌ను సీజ్ చేసిన మైనింగ్, విజిలెన్స్



అక్రమ క్వారీయింగ్ చేస్తున్న యంత్రాన్ని సీజ్ చేసిన అధికారులు

వీరనాయకునిపాలెం(చేబ్రోలు): పేద దళితులకు సాగు చేసుకోవటానికి చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు రావటంతో మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారుల బృందం మంగళవారం దాడులు నిర్వహించింది. మైనింగ్ విజిలెన్స్ ఏడీ కొండారెడ్డి, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, మైనింగ్ సర్వేయర్ వసుమతి, వీఆర్వో మధుబాబు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన 60మంది నిరుపేద దళితులకు 30 ఎకరాల సాగు భూమిని 1993లో ప్రభుత్వం అందించింది. సర్వే నెంబరు 494, 495, 498, 499, 501, 370, 371, 374 తదితర నెంబర్లలో పేదలకు ఒక్కొక్కరికి అర ఎకరం చొప్పున పంపిణీ చేసింది. దళితులకు చెందిన సాగు భూమిని కొంతమంది స్వాధీనం చేసుకొని వాటిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు కొద్దిరోజుల కిందట తెనాలి సబ్ కలెక్టర్, మైనింగ్ అధికారులు క్వారీలను తనిఖీ చేశారు. అక్రమ క్వారీయింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం అధికారుల బృందం జరిపిన దాడులలో వీరనాయకునిపాలెం గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమి సర్వే నెంబరు 498బి7,8లో క్వారీయింగ్ చేస్తున్న ఎల్ఐ కొయాచ్300 ప్రొక్లెయినర్‌ను సీజ్ చేశారు. యంత్రంను పోలీసు స్టేషన్‌కు తరలించకుండా డ్రైవర్ వైర్లు తొలగించి పరారయ్యాడు. మెకానికల్‌లను తీసుకువచ్చి ప్రత్యేక వాహనంలో ప్రొక్లెయినర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. 49వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వకం చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ఏ బసవ రాజశేఖర్‌పై మైనింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే గ్రామంలో అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తున్నవారు అధికారుల బృందం రాకను గమనించి యంత్రాలు, వాహనాలతో పరారయ్యారు. శేకూరు, వీరనాయకునిపాలెం పరిసర గ్రామాల్లో క్వారీలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 అడుగుల లోతులో తవ్వకాలు జరపటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న, అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి సుబ్బారావు

గుంటూరురూరల్: వేసవిలో సాగు చేపట్టదలిచిన వివిధ రకాల పంటలు, మాగాణుల్లో పండించే మొక్కజొన్న, అపరాల సాగులో తగిన యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించవచ్చని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి సుబ్బారావు అన్నారు. వేసవిలో కృష్ణ మండలం రైతులకు గ్రామీణ వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను అందించే విషయంపై ఆయన కార్యాలయంలో మంగళవారం చర్చా సమావేశం నిర్వహించారు. రైతులు తాము పండించే పంటలకు ఒకటి లేదా రెండు నీటి తడులు అందించే అవకాశం ఉన్నట్టయితే స్వల్పకాలిక పంటలు పెసరలో ఎల్‌జీజీ 607, 630, వైఎల్ఎమ్ 66 నువ్వు రకం, గరుడ అనే రకం కొర్రలు సాగు చేయటం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం మాగాణి భూమిలో పండించే మొక్కజొన్నలో కత్తెర పురుగు, మాగాణి అపరాల పంటల్లో రసంపీల్చే పురుగు, శెనగలో ఎండు తెగులు, మిరపలో ఆంత్రక్నోస్ కాయకుళ్ల వ్యాప్తి చెందేందుకు ఈ వాతావరణం అనుకూలంగా ఉంటుందని రైతులు గమనించాలన్నారు. కత్తెర పురుగుల నివారణకు ఒక మిల్లీలీటరు నోవాల్యురాన్, లేదా 0.4 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోమేట్‌ను, ఎండు తెగులు నివారణకు కాఫర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, లేదా హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లు, కాయకుళ్లు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ 3 గ్రాములు లేదా అజాక్సిస్ట్రోబిన్ 23శాతం ఎస్‌సీ 1 మిల్లీ లీటరు లేదా అజాక్సిస్ట్రోబిన్ 18.2 శాతం ప్లస్ డైఫెన్‌కోనెజోల్ 11.4 శాతం ఎస్‌సీ 1 మిల్లీ లీటరును ఒక లీటరు నీటిని కలిపి సాయంత్రం వేళల్లో పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. పంటల్లో చీడపీడల ఉధృతిని బట్టి ఒకటి లేదా రెండుసార్లు పిచికారి చేసుకోవచ్చన్నారు.

ప్రతి విద్యార్థి సేవా దృక్పథం కలిగి ఉండాలి



గుంటూరు ప్రభుత్వాసుపత్రి వద్ద అనాథలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న విద్యార్థులు

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థి సామాజిక సేవ చేసేందుకు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం తమ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థులు, టెక్ వింగ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుత్రి, పరిసర ప్రాంతాల్లోని అనాథలు, వృద్ధులు, పేదలకు 200 మందికి ఉచిత భోజనం ప్యాకెట్లు అందజేశారన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాలలో నడవాలని, తోటివారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని, సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్, విద్యార్థులు తదితరులున్నారు.

ఇరుకుటుంబాల మధ్య ఘర్షణ

గుంటూరు ఈస్ట్: ఇరు కుటుంబాల వారు పరస్పరం దాడి ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికృష్ణనగర్ 4వ లైనులో నివశించే కుమార్ నాయక్ ఇల్లు నిర్మిస్తున్నాడు. పక్కన ఉండే సమీప బంధువులు లక్ష్మీబాయి, ఆమె కుమారుడు రమేష్ తమ ఇంటికి నష్టం కలుగుతుందంటూ మంగళవారం గొడవపడ్డారు. రమేష్ ఇనుప రాడ్‌తో ప్రత్యర్థులపై దాడి చేశారు. కుమార్ నాయక్, అతని కుటుంబ సభ్యులు రమేష్ కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. ఇరు కుటుంబాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న 'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రం' పుస్తకావిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాగమల్లేశ్వర రావు తదితరులు

నెహ్రూనగర్: రజకులను అన్ని విధాల చైతన్యవంతులను చేయడమే తమ ఏకైక లక్ష్యమని రజక సమైక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే అనే పుస్తక ఆవిష్కరణను ఈ నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం అమరావతి రోడ్డులో పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో రజక జాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యల వాస్తవ రూపం ఈ రేవు తిరగబడిత ఊరు కురుక్షేత్రం అనే పుస్తకం ప్రధాన సారాంశమన్నారు. బీహార్ మాజీ మంత్రి శ్యామ్ రజక, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మట్లపూడి పూర్ణచంద్రరావు, శ్రీరాములు, పోకల వసంత్, అవులమంద వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..భక్తులకు కష్టాలు



ఆలయం ప్రాంగణంలో సిడిమాను ఉత్సవ దృశ్యం

పెదకాకాని: శ్రీ వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులకు కష్టాలు తప్పలేదు. అధికారులు సమయపాలన పాటించకపోవడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. పెదకాకాని వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం పురస్కరించుకుని అమ్మవారు ఈనెల 2వ తేదీన ఆలయం నుంచి గ్రామోత్సవంగా బయలుదేరి మండలంలోని తక్కెళ్లపాడు, రెండో రోజు వెనిగండ్ల గ్రామాలలో భక్తులకు దర్శనమిచ్చారు. మిగిలిన మూడు రోజులు పెదకాకానిలో గ్రామోత్సవం జరుగుతుంది. చివరిరోజు బహుళ పాడ్యమి సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామోత్సవం ముగించుకుని అమ్మవారు దేవాలయం చేరుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ముదరపోలు పోయుట, 7 గంటలకు గ్రామ సిడి, సింకా వారి బోనం, భక్తులచే సిడిమాను మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తుల సిడిమాను ప్రదర్శన పెదకాకాని పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్లకు ప్రత్యేకత. భక్తులు కోరిన కోర్కెలు తీర్చమని అమ్మవారికి మొక్కుకోవడం, గత ఏడాది కోరుకున్న కోర్కెలు తీరిన వారి సిడిమా తిరిగి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. సిడిమాను తిరిగే భక్తులు తిరునాళ్ల రోజు ఉదయం నుంచి ఉపవాసం ఉంటారు. దూర ప్రాంతాల వారు ఉదయమే ఆలయానికి చేరుకుంటారు. గ్రామోత్సవంలో ఉన్న అమ్మవారు ఆలయంలోకి చేరుకోగానే ముదరపోలు పోయడం సుమారు మూడు గంటలు పడుతుంది. ఆ తరువాత ముందుగా సిడిమానుకు మేకపోతును కట్టి తిరగడం, ఆ తరువాత వరుసగా మొక్కులు చెల్లించుకునే వారు సిడిమానుకు కట్టిన గంపలో కూర్చుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి పై నుంచి పండ్లు, ఆకులు, పసుపు కుంకుమలతో కిందకు వదలడం, వదిలిన పండ్లు, కాయల కోసం భక్తులు కొంగులు చాపి అందుకోవడం, అలా అందుకున్న వాటిని పవిత్రంగా ప్రసాదంగా స్వీకరించడం జరుగుతుంది. సోమవారం ఉదయం 11 గంటలకు అమ్మవారు ఆలయానికి చేరుకుంటారని ప్రకటించిన అధికారులు సాయంత్రానికి కూడా అమ్మవారిని ఆలయంలోకి తీసుకు రాలేక పోయారు. దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కూడా అమ్మవారి దర్శనం కలుగకపోవడంతో నిరాశకు గురయ్యారు. రాత్రి 12 గంటల తరువాత అమ్మవారు ఆలయంలోకి చేరుకోవడంతో ముదరపోలు, బోనము పూర్తి చేసుకుని మంగళవారం తెల్లవారుజామున 4 గంటల తరువాత 12 మంది భక్తులు సిడిమాను ప్రదర్శన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కలుగక భక్తులు ఇబ్బంది పడటంతో పాటు ఉదయం నుంచి మొక్కులు చెల్లించుకునేందుకు ఉపవాసాలు ఉన్న భక్తులు నీరసించిపోయారు. గత ఏడాది కూడా ఇదే సమస్య నెలకొన్నప్పటికీ ఈ ఏడాది సమస్యను అధిగమించడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామ ప్రజలు, భక్తులు ఆరోపిస్తున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఏపీఎం, సీసీలను సన్మానిస్తున్న స్పీచ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమేష్

కాకుమాను: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమశేఖర్, సీసీ రాఘవలను మంగళవారం స్పీచ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. సంస్థ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకు అనేక గ్రూపులకు రుణాలు మంజూరు చేయడంతోపాటు డ్వాక్రా గ్రూపు సభ్యులకు వివిధ రకాల యూనిట్‌లు మంజూరు చేసి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ ఏపీఎం అవార్డు అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను అర్హులందరికీ అందించి మరిన్ని అవార్డులు పొందాలని తెలిపారు. ఏపీఎం, సీసీలను సన్మానించారు.కార్యక్రమంలో విఓఏలు, డ్వాక్రా మహిళలు, సిబ్బంది ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ





ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులు

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందజేయటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రూ.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్రీలత, సీహెచ్ శ్రీనివాసరావు, వి జగదీష్ తదితరులు అభినందించారు.

బీసీల ఆత్మగౌరవ సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ



సభాస్థలి వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తదితరులు

గుంటూరురూరల్: నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఈనెల 12వ తేదీన జరగనున్న బీసీల ఆత్మగౌరవ సభ, బీపీ మండల్ విగ్రహావిష్కరణ కార్యక్రమ స్థలాన్ని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం సభాస్థలి వద్ద సభ నిర్వాహకులతో మాట్లాడారు. సభ నిర్వహణకు భద్రత చర్యలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు తగిన రక్షణ చర్యలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన సమయం కేటాయించాలన్నారు. సమావేశానికి వచ్చే ప్రజలు భోజన వసతుల వద్ద, సమావేశం వద్ద, ప్రజలకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పలు ప్రజాసంఘాల నాయకులు, నిర్వాహకులున్నారు.

ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

నెహ్రూనగర్:దేశ వ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టి ఓబీసీ జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో తగిన సీట్లు కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ అలిండియా ఉపాధ్యక్షుడు ఎస్.సోంప్రకాష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం యాదవాభ్యుదయం భవిష్యత్తు ప్రణాళిక అనే అంశంపై బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని డ్రైవర్ మృతి



మరణించిన షేక్ జానీబాషా

చేబ్రోలు: రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అతను అక్కడక్కడే మరణించిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం జరిగింది. దాచేపల్లి ప్రాంతానికి చెందిన షేక్ జానీ బాషా(55) నారాకోడూరు గ్రామ శివారులోని ఎస్‌వీఎస్‌పీ స్పిన్నింగ్ మిల్లులో కాటన్‌లోడ్‌తో వచ్చాడు. మిల్లులో దిగుమతి చేస్తుండటంతో జీబీసీ రహదారి పక్కన ఉన్న విఘ్నేశ్వర టీ స్టాల్‌కు వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న జానీబాషాను గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన లారీ డ్రైవర్ అక్కడక్కడే మరణించాడు. మృతుని తమ్ముడు ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చిలుకా గోపి (30) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. నాలుగు సంవత్సరాల క్రితం భార్యతో గొడవపడి విడిపోయాడు. గోపి మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 2వ తేదీ గోపి మానసికంగా కుంగిపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ త్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

పాత గుంటూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 7 వారాలే గడువు ఉందని, నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్ను వసూళ్లను ప్రతి రోజూ రూ.కోటి వసూలు లక్ష్యంగా పనిచేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెవెన్యూ వసూళ్లు, రీసర్వే, రోడ్ల విస్తరణ పనులు తదితర ఫీజు వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మార్చి చివరి నాటికి బకాయి ఉన్న రూ.70 కోట్ల వసూలుకు ప్రతి రోజు రూ.కోటి వసూళ్లు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఆస్తి పన్ను రూ.2 లక్షలు మించి, బకాయి ఉన్న రూ.17 కోట్ల వసూళ్లపై ఆర్ఓలు, డిప్యూటీ కమిషనర్లు బాధ్యత వహించాలన్నారు. నీటి చార్జీల వసూళ్లు నూరు శాతం జరగాలని, కమర్షియల్ భవనాలు కూడా బకాయిలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసూలు కాకపోతే ట్యాప్ కనెక్షన్ తొలగించాలని పేర్కొన్నారు. షాపుల అద్దెలు వసూళ్లు చేయాలని, రెన్యువల్స్‌ని వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. చౌడవరంలో కొన్ని అసెస్మెంట్‌లకు దీర్ఘకాలంగా వినియోగం మేరకు పన్ను విధించక పోవడం వల్ల భారీ మొత్తంలో ఆర్థిక నష్టం కలిగిందని, నిర్లక్ష్యంగా ఉన్న సంబంధిత అడ్మిన్, ఆర్ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌడవరం 187 వార్డ్ సచివాలయం అడ్మిన్ కార్యదర్శి తులసి రాంను సస్పెండ్ చేస్తూ, ఆర్ఐ షేక్ సలాంకు చార్జి మెమో ఇవ్వాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. రీసర్వే ఆశించిన స్థాయిలో జరగడం లేదని, వచ్చే వారానికి ప్రతి సచివాలయం పరిధిలో రీ సర్వే 75 శాతం మించాలన్నారు. బకాయిలు చెల్లించిన వారి హోర్డింగ్‌లకు ఫిబ్రవరి 15 నుంచి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల వారీగా సమీక్షించి, టీడీఆర్ బాండ్లు జారీ చేయాల్సిన వారికీ డాక్యుమెంట్స్ ప్రక్రియ పూర్తి చేయాలని, నష్ట పరిహారం చెల్లించిన గృహాల స్వచ్ఛంద తొలగింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. చిన్నేరుకుంట, రెడ్డిపాలెం, టెలికాంనగర్, గడ్డిపాడుల్లో రోడ్డు విస్తరణకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనుల్లో గైర్హాజరు అయిన 5 మంది ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు.